క్లుప్తంగా

క్రీడా దుస్తుల పంపిణీ



క్రీడా దుస్తులు అందిస్తున్న హెచ్‌ఎం నాగేశ్వరరావు, పూర్వ విద్యార్థి మణికంఠ

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సహకారంతో పాఠశాల విద్యార్థులకు క్రీడా దుస్తులు అందించారు. పాఠశాల 2013–14 బ్యాచ్‌కు చెందిన గుర్రం మణికంఠ, వరప్రసాద్, లీలాసాగర్‌లు 15 మంది విద్యార్థులకు దుస్తులు అందించారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు మాట్లాడుతూ క్రీడల్లో విద్యార్థులను ప్రోత్సహించాలనే ఆలోచనతో పూర్వ విద్యార్థులు క్రీడా దుస్తులు పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఫిజికల్ డైరెక్టర్లు ఎం.వి.నాగేశ్వరరావు, రాణి, ఉపాధ్యాయులు పండా శ్రీను, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విజయ దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో విజయ దుర్గాదేవి

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు పరిధి కండిపిల్లి వీధిలోని విజయ దుర్గాదేవి ఆలయ 12వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. లయ అర్చకులు రమేష్‌శర్మ, ఈశ్వర్ వేకువజామునే అమ్మవారిని విశేషంగా అలంకరించి చండీ హోమం నిర్వహించారు. అమ్మవారిని డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డి దర్శించుకుని పూజలు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనను ప్రారంభించారు. కార్యక్రమంలో తిప్పల నితీష్‌రెడ్డి, ఆలయ ధర్మకర్త దుర్యోధన, లక్ష్మి, లావణ్య, వాసంశెట్టి వెంకటేశ్వరరావు, త్రినాథరావు, కడవల రమణ, కండిపిల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె.రాజేంద్రకుమార్, వేదపండితులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

6.8 కిలోల గంజాయి పట్టివేత

పెందుర్తి: ఏవోబీ ప్రాంతం నుంచి రైల్లో ఇతర ప్రాంతాలకు గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం పట్టుకున్నారు. వారి నుంచి రూ.40 వేలు విలువైన 6.8 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివరాలివి.. ప్రకాశం జిల్లాకు చెందిన కువ్వవరపు వినీల్‌కుమార్, షేక్ సలీ రైల్లో పెందుర్తి రైల్వే స్టేషన్ వరకు గంజాయిని తీసుకువచ్చారు. దీనిపై పక్కా సమాచారం అందుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ మహేష్‌కుమార్ ఆదేశాల మేరకు సిబ్బంది మాటు వేసి వారిని పట్టుకున్నారు. అనంతరం పెందుర్తి ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించారు. దాడిలో ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఎస్‌ఐలు ఎస్.శ్రీనివాస్, సీహెచ్ రాజేశ్వరి, ఎల్.అరుణకుమారి, పి.అప్పారావు, హెచ్‌సీ కె.వెంకటరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సమ్మె కరపత్రం విడుదల

పరవాడ: విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను సంస్థలో విలీనం చేసి, వారి సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ నెల 15 నుంచి కార్మికులు చేయనున్న సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఫార్మాసిటీలో సబ్‌స్టేషన్ వద్ద సమ్మె కరపత్రాన్ని మంగళవారం విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కార్మికులందరికీ ఒకే క్యాడర్, ఒకే వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. 22వ పీఆర్సీ ఎరియర్స్, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్న నాన్ రెగ్యులర్ ఉద్యోగులు అందరికీ అన్‌లిమిటెడ్ వైద్య సౌకర్యం, కోటి రూపాయల ఇన్సూరెన్స్,బెనిఫిట్స్ కింద రూ.10 లక్షలు చెల్లించాలని కోరారు.

సేవా మూర్తి

మనం ఎంత సంపాదిస్తున్నాం అన్నది పక్కన పెడితే.. సమాజం కోసం ఏం చేశామన్నది ముఖ్యం. అది ఆలోచించి ఎవరైనా ముందుకు సాగితే సామాన్యులకు ఎంతో కొంత మేలు జరుగుతుందన్నది వాస్తవం. అయితే సమాజ అభివృద్ధి, పేద వర్గాల ఇబ్బందుల కోసం ఆలోచించే వారు అరుదుగా ఉంటారు. అటువంటి ఆలోచనలతో సమాజానికి ఏదో చేయాలన్న తపనతో ముందుకు వెళ్తున్నారు జొన్నకూటి విజయకుమార్. తన ఆదాయంలో కొంత పక్కన పెట్టి సమాజసేవకు ఉపయోగిస్తున్నారు. మహానేత వైఎస్సార్ స్ఫూర్తితో 12 ఏళ్లుగా జొన్నకూటి ఫౌండేషన్ పేరుతో సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రశంసలు అందుకుంటున్నారు.

– కూర్మన్నపాలెం

- 12 ఏళ్లుగా వితరణలు, సామాజిక సేవా కార్యక్రమాలు
- వరించిన పురస్కారాలు
- సేవలోనే తృప్తి అంటున్న జొన్నకూటి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు విజయకుమార్



వృద్ధులకు వాకర్స్ అందించి పండ్లు పంపిణీ చేస్తున్న విజయకుమార్



ఫౌండేషన్ వార్షికోత్సవం సందర్భంగా చిన్నారుల మధ్య కేక్ కట్ చేస్తున్న విజయకుమార్

ఒక వైపు వృత్తి.... తీరిక దొరికినప్పుడల్లా పేదలు నివసించే ప్రాంతాలకు వెళ్లి వారి కష్టసుఖాలను తెలుసుకోవడం ఆయన ప్రవృత్తిగా పెట్టుకున్నారు. అలా తన సొంత నిధులతో ఆ ప్రాంత ప్రజలకు నిత్యావసర సరకులు అందివ్వడం, ఇతర అవసరాలు తీర్చడం అలవాటుగా మార్చుకున్నారు. 12 ఏళ్ల కిందట ప్రారంభించిన సేవా కార్యక్రమాలను నిర్విరామంగా కొనసాగిస్తున్నారు.

కరోనాలో విశేష సేవలు

ముఖ్యంగా కరోనా సమయంలో విజయకుమార్ చేసిన సేవలకు ఎన్నో ప్రశంసలు అందుకున్నారు. ఇంటి నుంచి కాలు కూడా కదపలేని సమయంలో ఎంతోమంది కరోనా బాధితులకు సేవ చేయడంతో పాటు వారికి ఆహార దినుసులు అందజేసి శభాష్ అనిపించుకున్నారు. దీంతో కరోనా వారియర్ నేషనల్ అవార్డు లభించింది. ఈ అవార్డును 2020లో అప్పటి తెలుగు అకాడమీ చైర్మన్ డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ చేతుల మీదుగా అందుకున్నారు. అలాగే విజయవాడ, విజయనగరం,పశ్చిమగోదావరి, విశాఖ తదితరప్రాంతాల్లోని మురికివాడల్లో వైద్య శిబిరాలు నిర్వహించి సామాన్యప్రజలకు దగ్గరయ్యారు.

అవార్డులు.. పురస్కారాలు

పేదవర్గాల ప్రజలకు ఆయన చేస్తున్న సేవలను ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ గుర్తించి 2022లో ఉగాది నంది పురస్కారం అందజేసింది. అలాగే సేవారత్న, సర్ ఆర్డర్ కాటన్ పేరుమీద ప్రకటించిన అవార్డులు కూడా విజయకుమార్ అందుకున్నారు.



కరోనాలో అందించిన సేవలకు విజయకుమార్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి(ఫైల్)



అవార్డులతో విజయకుమార్

అనాథ పిల్లల సేవలో..

వైద్య శిబిరాలు.. పేదలకు సరకులు అందించడమే కాకుండా తనకు నెలనెలా వచ్చిన జీతంలోని కొంత భాగం అనాథ పిల్లలకోసం ఖర్చుపెడుతున్నారు. అనకాపల్లి, గాజువాక తదితర ప్రాంతాల్లో అనాథ ఆశ్రమాలకు కొంత మొత్తాన్ని అందించి తన సేవా భావాన్ని చాటుకుంటున్నారు. అంతేకాకుండా ఇద్దరు అనాథ పిల్లలను దత్తత తీసుకొని చదివించారు. ప్రస్తుతం వారిద్దరూ ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. దువ్వాడ, మంగళపాలెం ప్రాంతాల్లోని పేద ప్రజలకు ఎప్పటికప్పుడూ సహాయం చేస్తూ సేవా కార్యక్రమాలను ముందుకు తీసుకు వెళ్తున్నారు. ఉక్కులో పని చేస్తూ ఇటీవల రిటైర్ కావడంతో సామాజిక కార్యక్రమాలను మరింత విస్తృతం చేయనున్నట్టు తెలిపారు.

వైఎస్సార్ స్ఫూర్తితో..

మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు చేయాలని నిర్ణయించుకున్నా. దీని కోసం జొన్నకూటి ఫౌండేషన్ పెట్టాను. మా తల్లిదండ్రులు తాతారావు, గన్నెమ్మలు రైతుకుటుం అయినప్పటికీ తమకున్నంతలో వారు పేదలకు సాయం చేసేవారు. రాజశేఖరరెడ్డి కూడా ముఖ్యమంత్రిగా పేదలకు ఎనలేని మేలు చేశారు. అందుకే ఆయన్ను ప్రజలు గుండెల్లో పెట్టుకున్నారు. ఎంత సంపాదించినా రాని సంతృప్తి అవసరమైన వారికి చేయూత అందించడంలో వస్తుంది. ఇటీవలే రిటైర్ అయ్యాను. ఇంకా ఎక్కువ సమయం సామాజిక, సేవా కార్యక్రమాలకు కేటాయిస్తాను.

– జొన్నకూటి విజయకుమార్
జొన్నకూటి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు

ఎన్‌ఎంయూ స్టీల్‌సిటీ డిపో అధ్యక్షుడికి సత్కారం



రామకృష్ణను సత్కరిస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్ సిటీ డిపో ఎన్‌ఎంయూ అధ్యక్షుడు గండి రామకృష్ణ ఇటీవల పదవీవిరమణ చేయండతో మంగళవారం డిపోలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఎన్‌ఎంయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి వై. శ్రీనివాసరావు మాట్లాడుతూ రామకృష్ణ అనేక ఉద్యమాల్లో పాల్గొని అనేక ఒడిదొడుకులు ఎదుర్కొన్నారన్నారు. కార్మిక నాయకుడిగా విశేష సేవలందించారని కొనియాడారు. డిపో తరలింపు ప్రక్రియ ఆపే వరకు రాష్ట్ర కమిటీ అండగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణతో పాటు డిపో క్లర్క్‌గా పదవీ విరమణ చేసిన బి.వి.ఎల్.ఎస్.రాజును సత్కరించారు. ఈ సందర్భంగా ఎంప్లాయీస్ యూనియన్‌కు చెందిన కొంత మంది ఎన్ఎంయూలో చేరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు పి.పి.ఎం. రాజు, జి.ఆర్. రావు, జోన్ చైర్మన్ సూర్యం, రీజినల్ కార్యదర్శి పి. శంకరరావుతో పాటు నాయకులు పాల్గొన్నారు.

వేంకటాద్రిపై ప్రత్యేక పూజలు

పెందుర్తి: చాతుర్మాస దీక్షల్లో భాగంగా స్థానిక వేంకటాద్రిపై మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్తి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో సుందరకాండ హవనం చేశారు. అనంతరం శ్రీనివాస నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

జనావాసాల్లో గోవుల హల్‌చల్



వీధి రోడ్డు మలుపులో రోడ్డు మధ్యలో నిలిచిన గోవులు



కొండయ్యవలస హైస్కూల్ రోడ్డు మలుపులో పడుకున్న ఆవులు

ఇబ్బందులు పడుతున్న ప్రజలు

అగనంపూడి: జీవీఎంసీ 85వార్డు పరిధిలోని కొండయ్యవలసలో మూగజీవాల బెడద పెరిగింది. పాలు తీసుకుంటున్న పెంపకం దార్లు మిగిలిన సమయంలో ఆవులను కట్టకుండా వదిలేయడంతో అవి రోడ్లపై తిరుగుతున్నాయి. వేగనిరోధకాలుగా మారుతున్నాయి. మలమూత్రాలతో రోడ్లను అపరిశుభ్రం చేస్తున్నాయి.అయితే ఈ సమస్యపై జీవీఎంసీ ప్రజారోగ్యశాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తే అధికారులు స్పందించిన తీరు విస్మయానికి గురి చేసిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. పరిశీలనకు సిబ్బందికి పంపాం... వారిని సంప్రదించాలని ఫోన్ నంబర్‌ను ఫిర్యాదు దారుడికి వాట్సప్‌లో పంపడంతో కంగుతిన్నాడు. గోవులను వీధుల్లో తిరగకుండా అరికట్టాలని ఫిర్యాదు చేస్తే ఇలా స్పందించడం విడ్డూరంగా ఉందంటున్నారు. గుంపులు వీధి రోడ్లలో తిరుగుతుండడంతో మహిళలు, పిల్లలు వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారని... క్షేత్రస్థాయిలో పర్యటించి గోవుల యజమానులకు తగిన ఆదేశాలు ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

అంబుజా సిమెంట్స్‌ను అడ్డుకుంటాం



పెదగంట్యాడ ప్రధాన రహదారిలో ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న అంబుజా సిమెంట్స్ గ్రైండింగ్ యూనిట్‌ను అడ్డుకుంటామని సీపీఐ నాయకులు స్పష్టం చేశారు. ఈ మేరకు సీపీఐ ఆధ్వర్యంలో పెదగంట్యాడ ప్రధాన రహదారిలో మంగళవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సిమెంట్ ఫ్యాక్టరీని వ్యతిరేకించాలని ప్రజలకు పిలుపు నిచ్చారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు కె.వనజాక్షి, నాయకులు సాంబమూర్తి, పోతయ్య, పిల్లా పద్మ, శివ, ఈశ్వరరావు, కృష్ణ, భాస్కరరావు, తిరుపతిరావు పాల్గొన్నారు.

మహిళా కళాశాలలో విజిలెన్స్ వారోత్సవాలు

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం విశాఖపట్నం పోర్టు అథారిటీ విజిలెన్స్ డిపార్టుమెంట్, కళాశాల ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న విశాఖపట్నం పోర్టు అథారిటీ విజిలెన్స్ ఆఫీసర్ టీవీ శ్రీనివాసరావు విద్యార్థులకు విజిలెన్స్ అవేర్‌నెస్ ప్రాముఖ్యత వివరించారు. ఈ సందర్భంగా ఇష్యూస్ రిలేటింగ్ టు విజిలెన్స్ అండ్ ఫైట్ అగైనెస్ట్ కరప్షన్ అనే అంశంపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కన్వీనర్ ఎస్.అనురాధ, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ బి.అనూష, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి డాక్టర్ కిరణ్మయి, అధిక సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి



ఎయిర్ పోర్టు పర్యావరణ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, అధికారులు

మహారాణిపేట: విశాఖ ఎయిర్‌పోర్టు పరిసర ప్రాంతాల్లో అపరిశుభ్ర వాతావరణం లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. డ్రెయిన్ల ద్వారా మురుగునీరు, వర్షపు నీరు సాఫీగా పోయేలా చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన ఎయిర్‌పోర్టు పర్యావరణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పోర్టు ట్రక్ పార్కింగ్ ప్రాంతంలో లారీ డ్రైవర్లు పారబోస్తున్న ఆహార పదార్థాల కారణంగా పక్షులు చేరి విమాన రాకపోకలకు ప్రమాదం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మేహాద్రిగెడ్డ, ఇతర గెడ్డ ప్రాంతాల్లో పూడిక, చెత్తను క్రమం తప్పకుండా తొలగించాలని ఆదేశించారు. ఎయిర్‌పోర్టు పరిసరాల్లో నిర్మాణ సామగ్రి, చెత్తాచెదారం డంప్ చేయకుండా ప్రత్యేక పర్యవేక్షణ ఉంచాలన్నారు. సమావేశంలో ఎయిర్‌పోర్టు అథారిటీ, విశాఖపట్నం పోర్టు, ఐఎన్ఎస్ డేగా, జీవీఎంసీ, ఇరిగేషన్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అత్యవసర కేసులనే 108కి రిఫర్ చేయాలి



సూపరింటెండెంట్ డాక్టర్ సుజాతతో మాట్లాడుతున్న 108 జిల్లా మేనేజర్ సురేష్

మహారాణిపేట: అత్యవసర సమయంలో రోగుల్ని, క్షతగాత్రుల్ని ఆస్పత్రులకు చేర్చే 108 వాహనాల సేవలు కొన్నిసార్లు తమకు అందట్లేదని ప్రజల ఆరోపణ. ప్రభుత్వ ఆస్పత్రుల నుంచి ప్రధాన ఆస్పత్రులకు రిఫరల్ కేసులు అధికమవుతుండడం వల్లే ఈ జాప్యం నెలకొంటోందని 108 సిబ్బంది వాదన. హైరిస్క్ కేసులను మాత్రమే ఇలా తరలించాల్సి(ఐఎఫ్‌టీ) ఉన్నప్పటికీ కొన్ని సార్లు రోగుల ఒత్తిళ్లతో చిన్న చిన్న కేసుల తరలింపునకూ 108 వాహనాలను వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు సూచనల మేరకు 108 వాహన వ్యవస్థ జిల్లా మేనేజర్ ఎం.సురేష్‌కుమార్, పైలెట్లు, ఈఎంటీలు మంగళవారం గోపాలపట్నం సీహెచ్‌సీకి వెళ్లి అక్కడి పరిస్థితిని పరిశీలించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుజాతతో 108 జిల్లా మేనేజర్ సురేష్‌కుమార్ పలు అంశాలపై చర్చించారు. అత్యవసర కేసులను మాత్రమే ఇతర ఆస్పత్రులకు రిఫర్ చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆయా వాహనాల పరిస్థితిని సురేష్ పరిశీలించారు. డాక్టర్ సుజాత సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో 108 వ్యవస్థ ఆపరేషనల్ ఎగ్జిక్యూటివ్ సమీర్ తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా వ్యాపారులు నిబంధనలు పాటించాలి

కూర్మన్నపాలెం: బాణసంచా విక్రయదారులు తప్పకుండా నిబంధనలు పాటించాల్సిందేనని దువ్వాడ సీఐ కె.మల్లేశ్వరరావు సూచించారు. లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన మంగళవారం హెచ్చరించారు. తమ స్టాల్స్‌ను నివాస గృహాలకు దూరంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఫైర్, జీవీఎంసీ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఆయన సూచించారు. స్టాల్స్‌కు నాలుగువైపులా దారి ఉండాలని దుకాణాలకు ఆనుకొని వాటర్ ట్యాంకర్‌ను ఏర్పాటు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. దీపావళి సామగ్రి అమ్మకాలు కూడా ఈ నెల 20న మధ్యాహ్నం మూడు గంటలకు నిలిపివేయనున్నట్టు తెలిపారు.

సీపీఆర్‌పై అందరికీ అవగాహన అవసరం



సీపీఆర్‌పై విద్యార్థులకు వివరిస్తున్న ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం: విశాఖపట్నంలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా డాక్టర్ వి.ఎస్.కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సీపీఆర్‌పై మంగళవారం అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రెడ్‌క్రాస్ వలంటీర్లు సీపీఆర్ అత్యవసర దశల ప్రాముఖ్యతను అర్థం చేసుకోవాలని సూచించారు. ఐఆర్‌సీఎస్ చైర్మన్ సి.బాలసతీష్ మాట్లాడుతూ రోగి ప్రాణాలు కాపాడడంలో సీపీఆర్ ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు, ప్రజలకు సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న రెడ్‌క్రాస్‌ను ఆయన ప్రశంసించారు. ట్రైనర్ డాక్టర్ పి.రామారావు ప్రత్యక్షంగా సీపీఆర్ చేసి చూపించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ కె.రవిబాబు, ఎన్ఎస్ఎస్ జోనల్ ప్రోగ్రాం ఆఫీసర్ పి.ఉమామహేశ్వరరావు, జి.వి.ప్రతాప్, బి.లక్ష్మి, ఎస్.వి.రామారావు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్ అనుమానాస్పద మృతి

గాజువాక: గాజువాక ఆటోనగర్‌లో ఒక లారీ డ్రైవర్ అనుమానాస్పదంగా మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంనుంచి మిరాజ్ హుస్సేన (36) లారీలో గాజువాక ఆటోనగర్‌కు ఇటుకల లోడ్ తీసుకొచ్చాడు. ఆటోనగర్ నుంచి తుంగ్లాం వెళ్లేదారిలో లారీని పార్కు చేసి రాత్రికి లారీలోనే పడుకున్నాడు. అయితే ఉదయానికి మృతి చెంది ఉన్నట్టు గాజువాక పోలీసులకు సమాచారం అందింది. దీనిపై తమకు ఇప్పటివరకు ఎవరూ సంప్రదించలేదని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పరిశీలించిన పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందజేసినట్టు తెలిపారు. ప్రస్తుతానికి ఎటువంటి కేసు నమోదు చేయాలేదని పేర్కొన్నారు.

ఒత్తిడిని జయిస్తే ఆనందకర జీవితం



డాక్టర్ కిషోర్‌బాబును సత్కరిస్తున్న ప్రతినిధులు

సీతంపేట: దైనందిన జీవితంలో ప్రతి ఒక్కరూ అనేక రకాల సమస్యలతో విపరీతమైన ఒత్తిడికి గురవుతున్నారని ప్రముఖ న్యూరో ఫిజిషియన్ డాక్టర్ కిషోర్‌బాబు అన్నారు. నేషనల్ హెచ్‌ఆర్‌డీ నెట్‌వర్క్ విశాఖపట్నం చాప్టర్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో 'ఒత్తిడిని జయించే విధానం' పై మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆయన ప్రసంగించారు. నిజజీవితంలో ఎన్ని సమస్యలు ఎదురైనా వాటిని తేలికగా తీసుకోవాలన్నారు. చక్కని ప్రణాళికలతో స్థిరత్వంతో జీవిస్తూ మానసికంగా దృఢత్వాన్ని పెంచుకోవాలని సూచించారు. అప్పుడే ఒత్తిడికి గురికాకుండా ఆరోగ్యవంతమైన జీవితంతో ఆనందంగా జీవించవచ్చన్నారు. పారిశ్రామిక సంస్థల్లో పనిచేసే వారందరూ ఒత్తిడికి గురికాకుండా జాగ్రత్త వహించాలన్నారు. కార్యక్రమంలో చాప్టర్ ప్రెసిడెంట్ కె.వి.రావు, ఆచార్య సాంబశివరావు, శేషగిరిరావు, పి.భాస్కర్, శ్రీనివాస్, ఆర్.సుధాకర్, శ్రీరాములు, కృష్ణకుమార్, శివప్రసాద్, ఎస్‌వీఎస్ సుధాకర్ పాల్గొని డాక్టర్ కిషోర్‌బాబును సత్కరించారు.

ఘనంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవం



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు, వైద్య ఆరోగ్య సిబ్బంది

పెదగంట్యాడ: బాలికల సంరక్షణ విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపించాలని ఎంఈవో కంకటాల రమణాజీ అన్నారు. జీవీఎంసీ 75వ వార్డు నెల్లిముక్కు అంగన్‌వాడీ కేంద్రంలో పెదగంట్యాడ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల్లో మగవారితో సమానంగా బాలికలకు స్థానం కల్పించాలని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. సమాజ అభివృద్ధికి, మనుగడకు ఆడపిల్లలు చాలా అవసరమని పేర్కొన్నారు. అనంతరం నెల్లిముక్కులోని పలు ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి రూ.2.50 లక్షల విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న తిప్పల నితీష్‌రెడ్డి, ప్రణీత దంపతులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు పరిధిలోని నెల్లిముక్కులో పెంటమాంబ ఆలయ ఆవరణలో కొలువుదీరిన మహాశక్తి, భూలోకమ్మ, దుర్గాలమ్మ, కుంచుమాంబ, మరిడిమాంబ, శ్రీశక్తి అమ్మవార్ల ఆలయ పునర్నిర్మాన పనులు చకచకా సాగుతున్నాయి. ఆలయ ముఖద్వారాల నిర్మాణం కోసం గాజువాక వర్తక సంఘం గౌరవ అధ్యక్షుడు తిప్పల నితీష్‌రెడ్డి, ప్రణీత దంపతులు రూ. 2.50లక్షలు విరాళంగా అందజేశారు. ఆయన మంగళవారం కుటుంబ సమేతంగా ఆలయాన్ని సందర్శించి కమిటీ ప్రతినిధులకు విరాళం అందజేశారు. తన తల్లి తండ్రులు తిప్పల చినఅప్పారావు, అరుణ జ్ఞాపకార్థం ఈ విరాళం అందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గొందేశి మహేశ్వరరెడ్డి, పులి రమణారెడ్డి, గొందేశి అప్పలరెడ్డి, మొల్లి రమణ, పాల అప్పలరెడి, నీలాపు పరదేశి తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో గొప్ప నాయకులుగా రాణింపు



ప్రసంగిస్తున్న రేపల్లె శ్రీరామారావు

మద్దిలపాలెం: యువతరం నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని ఓఎన్‌జీసీ సీజీఎం రేపల్లె శ్రీరామారావు సూచించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం న్యాయ కళాశాల విద్యార్థులను ఉద్దేశించి ఆయన మంగళవారం ప్రసంగించారు. నాయకుడిగా రాణించాలనుకునే వ్యక్తులు ముందుగా స్వీయ క్రమశిక్షణ కలిగి ఉండాలని సూచించారు. నైతిక విలువలకు ప్రాధాన్యమిచ్చే వారు గొప్ప నాయకులుగా నిలుస్తారని చెప్పారు. క్లిష్ట సమయాల్లో సరైన నిర్ణయాలు తీసుకోవడం ఎంతో ప్రధానమని సూచించారు. అబ్రహాం లింకన్, వివేకానంద జీవితాలను ఉదహరిస్తూ విద్యార్థులకు స్ఫూర్తిదాయకమైన నాయకత్వ లక్షణాలు వివరించారు. యువతరం భవిష్యత్ భారతావనిని ఉన్నతంగా తీర్చిదిద్దే నాయకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యతోపాటు బహుముఖ ప్రజ్ఞ, నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సీతామాణిక్యం మాట్లాడుతూ మార్గనిర్దేశం చేస్తూ ఇతరులను ముందుకు నడిపించే వాడే నాయకుడిగా నిలుస్తాడని చెప్పారు. అనంతరం ముఖ్య అతిథి శ్రీరామారావును కళాశాల తరపున సన్మానించారు. కార్యక్రమంలో న్యాయ కళాశాల ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల సమ్మెకు సిటు మద్దతు

దాబాగార్డెన్స్: విద్యుత్ సంస్థలో పని చేస్తున్న పర్మినెంట్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, పీస్‌రేట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 15 నుంచి చేపట్టనున్న నిరవధిక సమ్మె విజయవంతం చేయాలని సిటు విశాఖ జిల్లా కమిటీ విద్యుత్ కార్మికులకు విజ్ఞప్తి చేస్తుందని జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ సంస్థలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని గత ఏడాదిగా అనేక దఫాలుగా ఈపీడీసీఎల్ పరిధిలో సీఎండీకి వినతి పత్రాలు అందజేసినట్లు తెలిపారు. చలో విద్యుత్ సౌధ కార్యక్రమాలు చేపట్టామన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం, విద్యుత్ యాజమాన్యం సమస్యలు పరిష్కరించకుండా కార్మికులు సమ్మెకు వెళ్లేలా చేస్తున్నాయని తెలిపారు. సమ్మె వల్ల ప్రజలకు జరిగే నష్టాన్ని నివారించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. తక్షణమే కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.